జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 22 ॥ఆదివారం ॥ 21-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



## రుక్మిణి వసంత్ డీప్‌ఫేక్ కేసులో ముగ్గురు అరెస్ట్



### ఇరాన్ ఒప్పందానికి
## ట్రంప్ మద్దతు

**యుద్ధ ఉద్రిక్తతలకు తాత్కాలిక విరామం**

**ఆంక్షల సడలింపుతో కొత్త ఆశలు**

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊరట**

**వాషింగ్టన్, జూన్ 20**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి తాత్కాలికంగా ముగింపు పలికే లక్ష్యంతో ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించారు. ఈ ఒప్పందం వల్ల ప్రాంతీయ శాంతి నెలకొనడంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ ప్రతినిధులు చర్చల్లో ఎంతో నైపుణ్యంతో వ్యవహరిస్తారని, వారు గొప్ప చరిత్ర, సంస్కృతి కలిగిన ప్రజలని ప్రశంసించారు. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా అమెరికా వెనక్కి తగ్గిందన్న విమర్శలను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. (మిగతా 2వ పేజీలో)

## బాల్య వివాహాల రహిత తెలంగాణే లక్ష్యం
### మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 20**

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పంచాయతీరాజ్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క (సీతక్క) సూచించారు. (మిగతా 2వ పేజీలో)




### టీఆర్ఎస్ జెండా పండుగ
## ఘనంగా నిర్వహణ

**పరకాలలో జెండా ఎగురవేసిన కవిత**

**అంబేద్కర్ విగ్రహానికి నివాళులు**

**భారీ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు**

**పరకాల, జూన్ 20**

తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ సందర్భంగా పరకాలలో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ నాయకులు, (మిగతా 2వ పేజీలో)



# మెట్రో రెండో మద్దతు



### కేంద్ర రైల్వే శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన లేఖ రాసి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.**

**- హైదరాబాద్, జూన్ 20 (రథసారథి)**



**హైదరాబాద్, జూన్ 20**

జూన్ 16న పంపిన తన గత లేఖను ప్రస్తావించిన ముఖ్యమంత్రి, మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయం, ముఖ్యంగా భారతీయ రైల్వే ఆర్థిక సంస్థ ద్వారా నిధుల సమీకరణ అంశం, హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్ర మద్దతు వంటి విషయాలు అత్యవసరంగా పరిష్కారం కావాల్సి ఉందని పేర్కొన్నారు. జూన్ 22, 23 తేదీలలో న్యూఢిల్లీ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో ప్రాజెక్టుకు సంబంధిం చిన అన్ని వివరాలు, ఒప్పందాలు, అవసరమైన పత్రాలను సమర్పించి అంశాలపై సమగ్రంగా చర్చించాలని భావిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థకు మెట్రో రైలు ప్రాజెక్టు అత్యంత కీలకమని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. నగర జనాభా, వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించడం అవసరమని వివరించారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టు అమలు ద్వారా నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ప్రాజెక్టు పురోగతికి సహకరించాలని ఆయన ఆకాంక్షించారు.



### పాడి పశువులపై రాష్ట్రవ్యాప్తంగా
## సర్వే నిర్వహించాలి
### భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 20**

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు అండగా నిలవడంతో పాటు విజయ డెయిరీని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పాల ఉత్పత్తి మరియు పాల ఉత్పత్తులపై ఆధారపడిన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని (మిగతా 2వ పేజీలో)



### పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వంపై
## కేటీఆర్ ఆగ్రహం

**రైతు బంధు ప్రభుత్వం పోయి రాబందు ప్రభుత్వం వచ్చింది**

**ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్న మాట ఏమైంది?**

**రైతాంగాన్ని కాపాడేందుకు ఉద్యమం తప్పదని హెచ్చరిక**

**రైతుల పంటలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు.**

**ఆదిలాబాద్, జూన్ 20**

బోథ్ నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా సమావేశమై రైతులకు శాపంగా మారే నిర్ణయం తీసుకుందని కేటీఆర్ విమర్శించారు. గతంలో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రక టించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చారని ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యం, (మిగతా 2వ పేజీలో)



## సూర్యాపేట జిల్లాలో చివరి ఆయకట్టుకు త్వరలోనే సాగునీరు
### ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 20**

సూర్యాపేట జిల్లాలోని టెయిల్ ఎండ్ ఆయ కట్టు ప్రాంతాలకు కృష్ణా జలాలను అందించేం దుకు చేపట్టిన రూ.394 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనుల పురోగతిని పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పథకం ద్వారా ముక్తేశ్వరపురం మేజర్, గణపురం మేజర్ ఆయకట్టుల పరిధిలోని సుమారు 14 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు చెరువులను నింపి, కోదాడ, హుజూర్‌నగర్, చిలుకూరు తదితర (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. పుణ్య క్షేత్ర దర్శనం చేసుకుంటారు. వ్యాపారమున ఒత్తిడి పెరుగుతుంది. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఉదర అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

వృషభం: చిన్ననాటి మిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

మిధునం: వాహన వ్యాపారస్తులు నూతన లాభాలు అందుకుంటారు. కుటుంబ వాతావరణం ఆనందంగా ఉంటుంది. ఆర్థికంగా సన్నిహితుల సహాయం అందుతుంది. స్థిరాస్తి వివాదాలు తొలగి ఊరట చెందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి. ఇంటా బయట జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

సింహం: బంధువులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు.

కన్య: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగ యత్నాలలో విజయం వరిస్తుంది. స్నేహితుల నుండి ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

తుల: కుటుంబ పెద్దల సహకారంతో కొన్ని పనులు పూర్తవుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. బంధుమిత్రుల నుండి కొన్ని వ్యవహారాలలో ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు.

వృశ్చికం: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలను పొందుతారు. ఇంటా బయట పెద్దల ఆదరణ పెరుగుతుంది. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పెరుగుతాయి. వ్యాపారంలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగుల విషయంలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి.

మకరం: ఉద్యోగ విషయమై అనుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వ్యాపారాల విస్తరణ ప్రయత్నములలో ఆటంకలు తొలుగుతాయి. దేవాలయ దర్శనం చేసుకుంటారు.

కుంభం: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ సంబంధిత వివాదాల నుంచి తెలివిగా బయటపడతారు. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. కీలక వ్యవహారాలలో మీ కలలు నిజమవుతాయి. ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది.

మీనం: ప్రయాణాలు అకస్మాత్తుగా వాయిదా పడతాయి. వృధా ఖర్చులు తప్పవు. కీలక వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. కొన్ని పనులలో సన్నిహితుల నుండి నిందలు పడవలసి వస్తుంది. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది.



# రైతు బంధు ప్రభుత్వం పోయి రాబందు ప్రభుత్వం వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

జొన్నలు, శనగలు, ఇతర పంటలను కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఇకపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన పరిమితి మేరకే కొనుగోళ్లు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. రైతు ఎకరానికి 40 క్వింటాళ్లు పండించినా, ప్రభుత్వం నిర్ణయించిన కోటా మేరకే కొనుగోలు చేస్తే మిగిలిన పంటను రైతు ఎక్కడ విక్రయించాలనే ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను మార్కెట్ దయాదాక్షిణ్యాలపై వదిలేయడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు బోనస్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, కొనుగోలు కేంద్రాలను విస్తరిస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్రం కొనుగోలు చేయబోమని చెప్పిన సందర్భాల్లో కూడా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఢిల్లీ వరకు వెళ్లి పోరాడి రైతులకు న్యాయం చేశామని పేర్కొన్నారు. రైతు బంధు, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రైతుల సమస్యలపై కేంద్రాన్ని నిలదీయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుల పంటలు ఎందుకు కొనుగోలు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ఆదిలాబాద్ ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు కూడా రైతుల పక్షాన నిలబడాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, రైతు బంధు నిలిపివేసి రైతులను ఇబ్బందుల్లోకి నెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడకుండా ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, ప్రతి గ్రామానికి వెళ్లి ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరిస్తామని ప్రకటించారు. రైతులు ఎవరినీ వేడుకోవాల్సిన అవసరం లేదని, తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగానికి అన్యాయం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, పంటల కొనుగోలు అంశంలో ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఇరాన్ ఒప్పందానికి ట్రంప్ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఒప్పందం ప్రపంచ మార్కెట్లకు ఊరటనిచ్చిందని, ముడి చమురు ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసిందని పేర్కొన్నారు. యుద్ధ పరిస్థితులు కొనసాగి ఉంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరిం త భారం పడేదని ఆయన అన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన పద్నాలుగు అంశాల తాత్కాలిక అవగాహన ప్రకారం పశ్చిమాసి యాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ వాణిజ్య రవాణాకు అనుకూలంగా తెరవనున్నారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న సైనిక దాడులు, క్షిపణి ఘటనల కారణంగా ఏర్పడిన ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఈ చర్యలు దోహదపడను న్నాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యానికి కూడా ఊరట లభించే అవకాశం ఉంది. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్‌పై అమలులో ఉన్న కొన్ని ఆర్థిక ఆంక్షలను అమెరికా సడలించేందుకు అంగీకరిం చింది. దీంతో ఇరాన్ తన చమురును ప్రపంచ దేశాలకు విక్రయిం చే అవకాశాన్ని పొందనుంది. ప్రతిగా ఇరాన్ తన వద్ద ఉన్న యురే నియం నిల్వలను అంతర్జాతీయ పర్యవేక్షణలో తగ్గించుకోవడానికి అంగీకరించింది. అణు కార్యక్రమాలు, ప్రాంతీయ భద్రత వంటి కీలక అంశాలపై రాబోయే రోజుల్లో మరిన్ని చర్చలు జరగనున్నా యి. అయితే ఇరాన్ పట్ల తమ ప్రభుత్వం ఎప్పుడూ బలహీన వైఖరి అవలంబించబోదని ట్రంప్ స్పష్టం చేశారు. గతంలో ఇరాన్‌కు చెం దిన ప్రముఖ సైనికాధికారి ఖాసీం సొలేమనీపై చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుత ఒప్పందాన్ని ఇరాన్ దుర్విని యోగం చేసినా లేదా నిబంధనలను ఉల్లంఘించినా వెంటనే రద్దు చేసి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఒప్పందం వల్ల ఇజ్రాయెల్ భద్రతకు భరోసా లభించడంతో పాటు ప్రపంచం మరో ఆర్థిక మాంద్యంలోకి వెళ్లకుండా కాపాడగలదని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు యుద్ధాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు, ఆంక్షలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఇరాన్ ప్రజలకు ఈ అవగాహన కొత్త ఆశలను కలిగిస్తోందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు ఇది కీలక అడుగుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## టీఆర్ఎస్ జెండా పండుగ ఘనంగా నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొనడంతో పరకాల పట్టణంలో ఉత్సాహ భరిత వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి హాజరైన కవిత ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలోని అణగా రిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది. అనంతరం బస్టాండ్ చౌర స్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవిత పార్టీ జెండా ను ఎగురవేశారు. తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ, రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కృషి కొనసాగిస్తుందని పేర్కొ న్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కవిత సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణ ంగా పార్టీ ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్ర మంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. జెండా పండుగను పురస్కరిం చుకుని పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిం చినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

## బాల్య వివాహాల రహిత తెలంగాణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. శిశు సంరక్షణను బలోపేతం చేయడం, బాలలపై జరుగుతున్న వేధింపులను తగ్గించడం, అలాగే పోక్సో (ఫ్రూజూూ) చట్టానికి సంబంధించిన కేసులను నివారించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య, సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాల అమలుపై రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అధ్యక్షుడు సీత దయాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన మాట్లాడుతూ, మహిళా మరియు శిశు సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని సూచించారు.

## సూర్యాపేట జిల్లాలో చివరి ఆయకట్టుకు త్వరలోనే సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

మండలాల్లో నీటి భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. మొత్తం 22 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్ పైప్‌లైన్‌లో 16 కిలోమీటర్ల ఫ్యాబ్రికేషన్ పూర్తికాగా, ఇప్పటికే 6 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధాన సివిల్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయని, మిగిలిన పనులు రానున్న వారాల్లో మరింత వేగం పుంజుకుంటాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కందిబండ, రామాపురం, హుజూర్‌నగర్, దొండపాడు, గణపురం, ఉచ్చిపూడి, ఎర్రవరం, రామలక్ష్మీపురం, పీకే బండ, కొగర్రాయి, పాలనగరం తదితర గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, టెయిల్ ఎండ్ ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు న్యాయమైన వాటా మేరకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కాలువల చివరి ప్రాంతాల్లో ఉన్నందున ఏ గ్రామం కూడా నదీజలాల ప్రయోజనాలకు దూరం కాకూడదని అన్నారు.

## పాడి పశువులపై రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ ద్వారా పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు శనివారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, పాల సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బకాయిలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు పాలు అందించే ప్రతిపాదనపై కూడా అధికారులు వివరాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తిపై ఖచ్చితమైన గణాంకాలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, పాల ఉత్పత్తి చేసే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని, వాటి ద్వారా ఉత్పత్తి అవుతున్న పాల పరిమాణాన్ని అంచనా వేసి తదుపరి సమావేశానికి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. రైతుల నుంచి సేకరించే పాలకు చెల్లించే ధరపై స్పష్టమైన విధానం ఉండాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులకు చెల్లింపులు ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో జరగాలని, పాఠశాలలకు సరఫరా చేసే పాల బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా సంబంధిత సంస్థలకు చెల్లించే విధానం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

# శ్వేత సంపాదకీయం

**ఆదివారం 21-6-2026**

## సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా...!

మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్వాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్ఛేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరనవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం.

ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్స్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్థ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది.

ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున – స్థిరసుఖ మాసనమ్– అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో – సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్ఛ – ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము – ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ – ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.–ధవుతి, నేతి, వస్తి, నౌలి, త్రటకం, తధా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి – అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

## సాయికృష్ణ అదృశ్యం కేసులో రెండోరోజు విచారణ

**మార్కాపురం-విజయవాడ ఎపిసోడ్‌పై ఫోకస్**

**8 మంది టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వాంగ్మూలం రికార్డ్**

**స్వర్గపురి శ్మశానవాటికలో పోలీసుల ఆరా**



అమరావతి,జూన్, 20; ఆంధ్రప్రదేశ్ లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో దర్యాప్తు రెండోరోజూ కొనసాగింది. ఏసీపీ దైవప్రసాద్ ఆధ్వర్యంలోని విచారణ బృందం విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులను, స్టేషన్ సిబ్బందిని విచారించింది. కృష్ణలంక స్వర్గపురి పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన అధికారులు, సాయికృష్ణ కేసులో కీలకంగా మారిన మార్కాపురం–విజయవాడ ఎపిసోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కృష్ణలంక స్టేషన్‌లో మొత్తం 8 మందిని విచారించిన బృందం, మార్కాపురం నుంచి సాయికృష్ణను విజయవాడకు తీసుకువచ్చారా లేదా అనే కోణంలో ప్రశ్నలు సంధించింది. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతాకుమారితో పాటు పలువురు టాస్క్‌ఫోర్స్, కృష్ణలంక స్టేషన్ సిబ్బంది వాంగ్మూలాలు నమోదు చేసింది. సాయికృష్ణను మార్కాపురం నుంచి ఎప్పుడు తీసుకొచ్చారు, ఇందుకోసం ఎవరిని పంపించారు, విజయవాడకు తీసుకొచ్చిన తర్వాత ఎవరికి అప్పగించారు వంటి అంశాలపై వివరాలు సేకరించింది. పెండింగ్‌లో ఉన్న నాన్–బెయిలబుల్ వారెంట్ల (ఎన్‌బీడబ్ల్యూలు) అమలుకోసమే సిబ్బందిని పంపించినట్లు ఏడీసీపీ లతాకుమారి వివరణ ఇచ్చినట్లు సమాచారం. మార్కాపురం నుంచి సాయికృష్ణను తీసుకొచ్చిన 4 మంది సిబ్బందిని కూడా విచారించి వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. మరోవైపు సాయికృష్ణ అదృశ్యం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించే క్రమంలో విచారణ అధికారి, పటమట సీఐ పవన్ కిశోర్ కృష్ణలంక స్వర్గపురిలోని శ్మశానవాటికను పరిశీలించారు. సాయికృష్ణ మృతదేహాన్ని అక్కడ ఖననం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టారు. సాయికృష్ణ మిస్సింగ్ అయిన తర్వాత స్వర్గపురిలో గుర్తుతెలియని మృతదేహాలు లేదా అనాథ శవాలను ఖననం చేశారా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఖనన ప్రక్రియలో నిర్దేశిత విధానాలను అనుసరించారా లేదా అన్న విషయాన్ని తెలుసుకునేందుకు రికార్డులు పరిశీలించడంతో పాటు అక్కడి సిబ్బందిని కూడా ప్రశ్నించారు.

ఇదిలా ఉండగా, సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి చేసిన ఆరోపణలు కేసులో మరింత సంచలనంగా మారాయి. “మీ వాడిని చంపేస్తా.. వాడి ఫొటోకు దండ రెడీ చేసుకో.. బయటకు పో” అంటూ కృష్ణలంక సీఐ నాగరాజు తనను బెదిరించి దుర్భాషలాడారని ఆమె విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హత్య కేసులో అరెస్టై కొంతకాలం జైలులో ఉండి బెయిల్‌పై విడుదలైన తన కుమారుడు సాయికృష్ణ పోలీసుల భయంతో మార్కాపురంలో తలదాచుకున్నాడని, కృష్ణలంక, మాచవరం పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో కోర్టుకు హాజరుకాకపోవడంతో అతనిపై నాన్–బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని అమలు చేసేందుకు పోలీసులు మే మొదటి వారంలో మార్కాపురం నుంచి సాయికృష్ణను విజయవాడకు తీసుకువచ్చారని ఆరోపించారు. ఆ విషయం తెలుసుకుని తాను కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లగా సీఐ నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారని, కొద్దిసేపటికి స్టేషన్ పైఅంతస్తు నుంచి తన కుమారుడి కేకలు వినిపించడంతో వెళ్లి చూడగా లాకప్‌లో కనిపించాడని పేర్కొన్నారు. ఒక్కసారి తన కుమారుడిని చూసేందుకు అనుమతించాలని ప్రాధేయపడినా సీఐ వినిపించుకోలేదని విజయలక్ష్మి ఫిర్యాదులో వివరించారు. ప్రస్తుతం ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని విచారణ బృందం ఈ ఆరోపణలతో పాటు సాయికృష్ణ అదృశ్యానికి సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తోంది.



## కాపు రాజకీయాల్లో కొత్త సమీకరణాలు

**తోట త్రిమూర్తులు నాయకత్వంలో సమావేశానికి సన్నాహాలు**


కాకినాడ, జూన్, 20: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కాపు సామాజిక వర్గంలో తన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వంగవీటి రంగా, ముద్రగడ పద్మనాభం వంటి కాపు ఉద్యమ నేతల సరసన తనకు ప్రత్యేక గుర్తింపు రావాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో ఆదివారం వైసీపీ అనుబంధ కాపు నేతల సమావేశాన్ని నిర్వహించనున్నారు.

**కాపు సమస్యలపై చర్చ..70 మంది నేతలు, 500 మంది కార్యకర్తలు**

తోట త్రిమూర్తులు గత కొన్నేళ్లుగా కాపు సమస్యలపై గళమెత్తుతూ వస్తున్నారు. ఆయనను ప్రముఖ కాపు నాయకుడిగా చూడాలనే అభిప్రాయం కొంతమంది కాపు నేతల్లో ఉన్నప్పటికీ, గత ఐదేళ్లలో సంఘం ఆశించిన లక్ష్యాలను సాధించలేదంటూ కాపు సంఘం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాపు సంఘం సలహాదారు డి.ఎన్. రమేష్ మాట్లాడుతూ, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు తోట త్రిమూర్తులను ఎమ్మెల్సీగా నియమించాలని సంఘం సిఫారసు చేసిందని, అయితే ఆశించిన మేర ఫలితాలు రాలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం కాపు వర్గానికి నిజమైన స్వరం తోట త్రిమూర్తులేనని, భవిష్యత్తులో ఆయన అగ్రశ్రేణి కాపు నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.

**'కాపు' ముఖ్యమంత్రి కావాలన్న త్రిమూర్తులు**

ఆదివారం జరగనున్న సమావేశానికి దాదాపు 70 మంది కాపు నాయకులు, 500 మందికి పైగా కార్యకర్తలు హాజరుకానున్నట్లు తోట త్రిమూర్తులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని చెప్పారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎదగాలని తాను కోరుకుంటున్నానని, అది జరిగితే తనకు ఎంతో ఆనందంగా ఉంటుందని త్రిమూర్తులు స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఆదివారం సమావేశం నేపథ్యంలో ఎన్డీఏ కూటమి నేతలు ఆందోళన చెందుతున్నారని, అందుకే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాకినాడలో సమాంతర సమావేశాన్ని ఏర్పాటు చేశారని ఆయన వ్యాఖ్యానించారు.



## ట్రంప్ చేతికి ఎగిరే వైట్ హౌస్

**ఖాతార్ పాలకులు ఇచ్చిన విమానాన్ని ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు**

**రూ.3,300 కోట్ల విలువైన విమాన్ని ఇచ్చిన ఖతార్**

గ్లోబల్ డెస్క్, జూన్ 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సరికొత్త తాత్కాలిక ‘ఎయిర్‌ఫోర్స్ వన్’ (బోయింగ్–747 జంబో జెట్) విమానాన్ని ఆవిష్కరించారు. ఖతార్ ప్రభుత్వం నుంచి బహుమతిగా వచ్చిన ఈ విమానం చుట్టూ ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కొంతకాలంపాటు ఆయన ఈ విమానంలోనే ప్రయాణించనున్నారు. తనకు ఇచ్చిన బహుమతిపై ఖతార్ పాలకులకు ట్రంప్ ధన్యవాదాల తెలిపారు.

**ఈ సరికొత్త ‘ఎగిరే వైట్‌హౌస్’ ప్రత్యేకతలు ఇవే**

- అద్భుతమైన డిజైన్: ట్రంప్ తన స్వంత రుచికి అనుగుణంగా అమెరికా జాతీయ పతాక రంగులైన ఎరుపు, తెలుపు, నేవీ బ్లూ మరియు గోల్డ్ కలయికతో ఈ విమానం వెలుపలి రంగులను సిద్ధం చేయించారు.
- కళ్లు చెదిరే ఇంటీరియర్: విమానం లోపలి భాగం అత్యంత విలాసవంతమైన లెదర్ సీట్లు, విలువైన ప్లాష్ కార్పెట్లు, ప్రత్యేకమైన వుడెన్ ప్యానెలింగ్, మరియు గోల్డ్ షేడ్స్ కలిగిన లేత గోధుమ రంగు గోడలతో రాజప్రాసాదాన్ని తలపిస్తోంది.
- సాంకేతిక సామర్థ్యం: పాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానాలతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు పరిమాణంలో ఉంటుంది. ఇది ఎంతో వేగంగా, ఎక్కువ దూరం ఇంధనం నింపాల్సిన అవసరం లేకుండా ప్రయాణించగలదు.
- తాత్కాలిక వారధి: యూఎస్ వైమానిక దళం బోయింగ్ సంస్థకు ఆర్డర్ చేసిన కొత్త విమానాలు (ఎజ–25దీ) అందడానికి మరికొంత సమయం (బహుశా 2028 వరకు) పడుతుంది. అప్పటివరకు అధ్యక్షుడి ప్రయాణాల భారాన్ని తగ్గించడానికి ఈ ఖతార్ జెట్‌ను ఒక వారధిలా వినియోగిస్తారు.

**ఖతార్ గిఫ్ట్‌పై రేగుతున్న వివాదం**

దాదాపు 400 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,300 కోట్లకు పైగా) విలువైన ఈ విమానాన్ని ఒక విదేశీ ప్రభుత్వం నుండి బహుమతిగా స్వీకరించడం అమెరికాలో తీవ్ర రాజకీయ, నైతిక మరియు రాజ్యాంగపరమైన చర్చకు దారితీసింది. సాధారణంగా అమెరికా నిబంధనల ప్రకారం విదేశాల నుంచి వచ్చే ఖరీదైన బహుమతులపై ఆంక్షలు ఉంటాయి. ఈ విమర్శలను ట్రంప్ కొట్టిపారేశారు. ఇంతటి అద్భుతమైన విమానాన్ని తిరస్కరించడం “మూర్ఖత్వం” అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు, తాను పదవి నుంచి తప్పుకున్నాక దీనిని తన వ్యక్తిగత అవసరాలకు వాడబోనని, భవిష్యత్తులో నిర్మించబోయే తన ‘ప్రెసిడెన్షియల్ లైబ్రరీ’కి విరాళంగా ఇస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ విమానానికి వైమానిక దళం ఆధ్వర్యంలో తుది విమాన పరీక్షలు జరుగుతున్నాయి. జూలై 4న జరగబోయే అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఫ్లైపాస్ (విమానాల ప్రదర్శన)లో ఈ ‘ఎగిరే వైట్‌హౌస్’ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.



## రైతు వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టింది

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20

రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతోందని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రులు చేసిన వ్యాఖ్యలు రైతుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కోటా మేరకే ధాన్యం కొనుగోలు చేస్తామని, అదనంగా ఒక్క గింజ కూడా కొనబోమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం రైతులకు మరణశాసనం లాంటిదని ఆయన అన్నారు. ఒకప్పుడు అన్నపూర్ణగా పేరొందిన తెలంగాణలో అన్నదాతలను అనాథలుగా మార్చే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి రైతుల జీవనోపాధిని ప్రమాదంలో పడేసిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపించారు. పదేళ్లపాటు ధైర్యంగా వ్యవసాయం చేసిన రైతులను మళ్లీ సమైక్య రాష్ట్రం నాటి ఇబ్బందుల్లోకి నెట్టేశారని పేర్కొన్నారు.

#### బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కష్టాలు తెలిసిన నాయకుడిగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని చింతా ప్రభాకర్ తెలిపారు. రైతుబంధు పథకం ద్వారా 11 విడతల్లో రూ.72 వేల కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని చెప్పారు. రైతు బీమా పథకం కింద రైతు కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించామని వెల్లడించారు. రైతు రుణమాఫీ కోసం రూ.29 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.6,800 కోట్లు ఖర్చు చేశామని, మొత్తంగా రైతుల ఖాతాల్లో లక్ష కోట్లకు పైగా నేరుగా జమ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి దేశానికి ఆదర్శంగా నిలిచామని అన్నారు.

#### వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

రైతును కేంద్రబిందువుగా చేసుకుని పాలన సాగించడం వల్ల తెలంగాణలో వ్యవసాయ విప్లవం చోటుచేసుకుందని ఆయన తెలిపారు. బీడు భూములు సస్యశ్యామలంగా మారాయని పేర్కొన్నారు. 2014కు ముందు కోటి 31 లక్షల ఎకరాల పంట విస్తీర్ణం ఉండగా, 2023 నాటికి అది 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు పెరిగిందని వివరించారు. తెలంగాణ దేశానికే ఆహార ధాన్య ఉత్పత్తిలో కీలక రాష్ట్రంగా ఎదిగిందని చెప్పారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు అండలి కరోనా క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఏడు వేలకుపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు వద్దే చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, శనగ, కందులు, పెసలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ తదితర పంటలను కూడా కొనుగోలు చేసినట్లు తెలిపారు.

#### కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని చింతా ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాలనే భావన ప్రజల్లో బలపడుతోందని అన్నారు. రాష్ట్ర వనరులను ఢిల్లీకి తరలించే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు.

#### భూముల సమస్యపై ఆందోళన

పదేళ్లపాటు రైతుల భూములను కాపాడిన బీఆర్ఎస్ ప్రభుత్వం అనంతరం ప్రస్తుతం అసైన్డ్ భూముల విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని మంత్రులు, జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. రైతులను భయభ్రాంతులకు గురిచేసి భూములు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

#### అభివృద్ధి పనులు, అక్రమాలపై స్పందన

గత ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి నిధులను కూడా ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని చింతా ప్రభాకర్ విమర్శించారు. కొత్తగా నిధులు తీసుకురాకుండా కేవలం ప్రచారానికే పరిమితమవుతోందని అన్నారు. అక్రమ నిర్మాణాలు, పేదల భూముల ఆక్రమణలను సహించబోమని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, నాయకులు శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ నాయక్, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఘనంగా సంగారెడ్డిలో నమో జెన్ జీ కార్యక్రమం

### దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలి

### ఉద్యోగాలు కోరేవారిగా కాకుండా ఉద్యోగాలను సృష్టించే ఆవిష్కర్తలుగా ఎదగాలి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డిలో నిర్వహించిన నమో జెన్ జీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయకుడు యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు నేటి యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారిగా కాకుండా, కొత్త అవకాశాలను సృష్టించి ఇతరులకు ఉపాధి కల్పించే ఆవిష్కర్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. డిజిటల్ విప్లవానికి నాయకత్వం వహిస్తున్న జెన్ జీ యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. అలాగే యోగా, ధ్యానం ద్వారా మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకుని, సైబర్ మోసాలు, ఫేక్ న్యూస్ వంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సోషల్ మీడియాను సామాజిక చైతన్యం, సానుకూల మార్పులకు వేదికగా వినియోగించాలని సూచించారు. సబ్ కా సాత్ -- సబ్ కా వికాస్ -- సబ్ కా ప్రయాస్ అనే స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి, ప్రజా సమస్యలపై బాధ్యతా యుతంగా



స్పందిస్తూ రేపటి సమాజానికి నాయకత్వం వహించే యువశక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, పార్టీ నాయకులు, బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

## జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కేసులకు సామరస్యపూర్వక పరిష్కారం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్సా), తెలంగాణ రాష్ట్రన్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) మార్గదర్శకాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి. భవాని చంద్ర మాట్లాడుతూ ప్రజలకు సులభమైన, వేగవంతమైన న్యాయం అందించడం, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించడం, పరస్పర అంగీకారంతో వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించడం, సమయం, ధనాన్ని ఆదా చేయడం లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ఎలాంటి కోర్టు ఫీజు ఉండదని, పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి చెల్లిస్తారని పేర్కొన్నారు. లోక్ అదాలత్ అవార్డు సివిల్ కోర్టు డిక్రీతో సమానమని, అది తుది నిర్ణయంగా పరిగణించబడుతుందని, దానిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. రాజీకి అనువైన పోలీసు కేసులు, భార్యాభర్తల మధ్య చిన్నచిన్న వివాదాలు, బ్యాంకు కేసులు, ఎక్సైజ్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చని సూచించారు. క్షణికావేశంలో తలెత్తిన వివాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, రాజీ మార్గాన్ని ఎంచుకుని సామరస్య వాతావరణంలో జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పరితోష్ పంకజ్, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి సతీష్ కుమార్, పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీలేఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి డీవీఆర్ తేజు కార్తీక్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి. దీప్తి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మా ఫాతిమా, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. ధనలక్ష్మి, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి. దుర్గారాణి, ప్రత్యేక ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి అమిసి జాజియాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. సంజీవరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది జి. ప్రభుధాన్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

## చెరువు సుందరీకరణకు రూ.500 కోట్లతో ప్రణాళికలు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20





సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ చెరువును రూ.500 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన ప్రణాళికలకు మరింత వేగం చేకూరుతోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు, చేపట్టాల్సిన పనులపై విస్తృతంగా చర్చించారు. సుమారు కిలోమీటరున్నర పొడవున ఉన్న చెరువు కట్టను ఆధునిక హంగులతో అభివృద్ధి చేయడం, నెక్లెస్ రోడ్ నిర్మాణం, పార్కుల ఏర్పాటు, ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై అధికారులతో సమీక్షించారు. సంగారెడ్డి పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చే సందర్శకులను ఆకట్టుకునే విధంగా కింది బజార్ చెరువును అభివృద్ధి చేయాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగేలా అవసరమైన ప్రతిపాదనలు, పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రెండేళ్లలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమీక్ష సమావేశం అనంతరం జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కింది బజార్ చెరువు కట్ట ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా అలుగు సమీపంలోని ప్రభుత్వ భూములను సందర్శించి, వివిధ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రాంతాలను గుర్తిస్తూ అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు అమలులో నాణ్యతతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

---

## మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20

మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడిన నేపథ్యంలో అత్యవసర మరమ్మత్తు పనులు చేపడుతున్నందున జూన్ 21, 22 తేదీల్లో పలు మున్సిపాలిటీలు, మండలాలకు తాగునీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ) విజయలక్ష్మి తెలిపారు. బూసారెడ్డిపల్లి ఫిల్టర్ బెడ్ నుంచి బుదేరా వరకు ఉన్న 1200 మిల్లీమీటర్ల ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడటంతో మరమ్మత్తు పనులు అత్యవసరంగా చేపడుతున్నామని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పనుల కారణంగా జూన్ 21 (ఆదివారం), జూన్ 22 (సోమవారం) తేదీల్లో తాగునీటి సరఫరా పూర్తిగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మునిపల్లి, కోహీర్, ఝరాసంగం, జహీరాబాద్, మొగుడంపల్లి, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్, అమీన్‌పూర్, ఇంద్రేశం, పటాన్‌చెరు మున్సిపాలిటీలు మరియు సంబంధిత మండలాల పరిధిలోని ప్రాంతాలకు ఈ రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతుందని వెల్లడించారు. మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్న ఈఈ విజయలక్ష్మి, ఆయా ప్రాంతాల ప్రజలు అవసరమైన మేర ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకుని శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

---

## నీట్ (యూజీ)-2026 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20


సంగారెడ్డి జిల్లాలో జూన్ 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు, ఆధార్ లేదా ఇతర ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజు ఫోటోతో పాటు పారదర్శక నీటి బాటిల్ మాత్రమే వెంట తీసుకురావాలని తెలిపారు. అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ మూసివేత సమయం మధ్యాహ్నం 1.30 గంటల కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలని, ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ం

---

## లగ్డారం దళితుల అసైన్డ్ భూముల జోలికి రావొద్దు

### ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 20



పటాన్‌చెరు మండలం లగ్డారం గ్రామంలోని దళితుల అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పొట్టోళ్ల వెంకటేష్ అధ్యక్షతన అసైన్డ్ భూముల బాధిత రైతులతో సమావేశమై, అనంతరం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా బుచ్చేంద్ర మాదిగ మాట్లాడుతూ, సర్వే నంబర్ 498లోని 22 ఎకరాల అసైన్డ్ భూములను దళిత కుటుంబాలు దాదాపు 70 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. గతంలో భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు జీవనాధారంగా ప్రభుత్వం కేటాయించిన ఈ భూములను ప్రస్తుతం ఎన్‌టీపీ ప్లాంట్ ఏర్పాటు పేరుతో స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడం బాధాకరమని విమర్శించారు. జిల్లా లో దళితుల అసైన్డ్ భూములనే లక్ష్యంగా చేసు కుని వాటిని స్వాధీనం చేసుకుని పారిశ్రామిక అవసరాలకు వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నారనే అనుమానం వ్యక్తమవుతోందని ఆయన అన్నారు. లగ్డారం గ్రామ దళితుల అసైన్డ్ భూముల జోలికి ప్రభుత్వం, అధికారులు వెళ్లవద్దని ఎమ్మార్పీ ఎస్ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. దళితుల భూములను స్వాధీనం చేసుకోవడం ద్వారా వారిని మరింత పేదరికంలోకి నెట్టే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని, మానసిక వేదనకు గురి చేయకుండా పట్టాదారు పాస్‌బుక్‌లు జారీ చేసి సాగుకు పూర్తి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పొట్టోళ్ల వెంకటేష్ మాదిగ, జిల్లా కార్యదర్శి బండరాజు మాదిగ, మల్లేష్, జీవన్‌తో పాటు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# బ్యాంకు రీజనల్ మేనేజర్‌గా అప్పారావు బాధ్యతలు

**ఆదిలాబాద్, జూన్ 20**

తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏ. అప్పారావు శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయనకు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణ, ప్రజలకు ఆర్థిక సేవల అందుబాటుపై చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బ్యాంకుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నూతన బాధ్యతలు చేపట్టిన ఏ. అప్పారావుకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు గ్రామీణాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా కృషి చేస్తామని అప్పారావు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకు తనవంతు పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు శాఖకు చెందిన ఎస్ఎంబి అరుణ్ కుమార్, ఎస్ఎంఓ రవికుమార్, ఇతర బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నూతన రీజనల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల పురోగతికి బ్యాంకింగ్ రంగం మరింత సహకారం అందించాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు సమిష్టిగా పనిచేయాలని అధికారులు ఆకాంక్షించారు.



# వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత

**మల్కాజిగిరి, జూన్ 20**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి మౌలాలి ఫ్లైఓవర్, మల్కాజిగిరి రహదారి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ పర్యటనలో హైడ్రా, రామ్‌కీ సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాల సమయంలో నీరు నిలిచిపోయే ప్రాంతాలు, తెరిచి ఉన్న కాలువలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టిని క్రమం తప్పకుండా తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే అడ్డంకులను వెంటనే తొలగించాలని సూచించారు. నీటి పారుదల వ్యవస్థలను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షపు నీరు వేగంగా వెళ్లేలా పారుదల మార్గాల అనుసంధానాన్ని బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. మల్కాజిగిరి పరిధిలో వర్షాకాలానికి ముందుగానే అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. నీటి నిల్వ సమస్యలను నివారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.



# ఓటు హక్కు పరిరక్షణకు అప్రమత్తంగా ఉండాలి

**భూపాలపల్లి, జూన్ 20**

భూపాలపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అవగాహన సదస్సులో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డితో కలిసి జరిగిన ఈ కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి ఓటు విలువైనదేనని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులకు సహకరిస్తూనే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పర్యవేక్షించాలని కోరారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తొలి రోజు నుంచే కులం, మతం, లింగ భేదాలు లేకుండా అందరికీ ఓటు హక్కు కల్పించబడిందని వక్తలు గుర్తు చేశారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో మహిళలకు ఓటు హక్కు రావడానికి దశాబ్దాలు పట్టిందని, భారత ప్రజాస్వామ్యం ఈ విషయంలో ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దానిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాజకీయ వివక్షకు తావులేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# రహవీర్ పథకంపై అవగాహన కల్పించాలి

**ఆసిఫాబాద్, జూన్ 20**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను గోల్డెన్ అవర్‌లోపు ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రహవీర్ పథకం కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తోందని జిల్లా పోలీసు అధికారి నితికా పంత్ తెలిపారు. ప్రజలు ఈ పథకంపై అవగాహన పెంచుకుని ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంట అత్యంత కీలకమని తెలిపారు. ఈ సమయంలో బాధితులను సమీప ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అలాంటి సేవ చేసిన వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం రూ. 25 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తుందని వివరించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే వ్యక్తులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయరని, వారికి చట్టపరమైన రక్షణ కూడా ఉంటుందని తెలిపారు. మానవత్వంతో స్పందించి బాధితులను ఆదుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.



# ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

**తిరుపతి, జూన్ 20**

తిరుమల శ్రీవారి భక్తులు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు ఉదారంగా విరాళాలు అందిస్తూ అన్నదాన కార్యక్రమాలకు అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు యలమంచిలి కృష్ణారావు, వడ్లమూడి లలిత్ కుమార్ చెరో రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షలను ట్రస్టుకు విరాళంగా అందజేశారు. ఈ విరాళాల డిమాండ్ డ్రాఫ్టులను టీటీడీ పాలక మండలి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల నాయుడు హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో స్వీకరించారు. అనంతరం దాతలను ప్రత్యేకంగా అభినందిస్తూ వారి సేవా భావాన్ని కొనియాడారు. శ్రీవారి అన్నప్రసాదం కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. భక్తులు అందిస్తున్న విరాళాలు ఈ మహోన్నత కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా అన్నదానం అత్యంత గొప్ప దానంగా భావించబడుతుందని బొల్లినేని రాజగోపాల నాయుడు అన్నారు.



# కలెక్టర్‌గా తనిఖీ.. ఉపాధ్యాయురాలిగా పాఠాలు

**మహబూబాబాద్, జూన్ 20**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, రుచికరమైన మరియు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి నాణ్యమైన భోజనం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలలో తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయురాలి పాత్రలోకి మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను ప్రోత్సహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, విద్యా కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, విద్యా వికాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణపై కూడా కలెక్టర్ దృష్టి సారించారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ స్నేహ శబరిష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.





## పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు

**హైదరాబాద్, జూన్ 20**

రంగారెడ్డి నగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎర్వ సాయికిరణ్ (బంటి) తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ శాసన సభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ శాసనసభ్యుడు కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎర్వ సాయికిరణ్‌కు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొంటూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎర్వ సాయికిరణ్ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నారని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎర్వ సాయికిరణ్ మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాల సాధనకు, ప్రజా సేవకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.



## హబ్సిపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**దుబ్బాక, జూన్ 20**

సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. హబ్సిపూర్ గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే పారిశుద్ధ్య సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## స్వచ్ఛాంధ్రకు ప్రజల భాగస్వామ్యం అవసరం

**శ్రీకాకుళం, జూన్ 20**

స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యుడు గొండు శంకర్, జిల్లా అధికారులతో కలిసి గార మండలం తూలుగు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొని స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ, విద్యా కార్యక్రమాలపై ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.




## కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోంది: బీఆర్ఎస్

**హనుమకొండ, జూన్ 20**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ప్రభుత్వ ప్రధాన విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ శాసనసభ్యుడు ఆరూరి రమేష్, రైతు రుణ విమోచన కమిషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును విస్మరించిందన్నారు. రైతులకు పంటల కొనుగోళ్లలో అన్యాయం జరుగుతోందని, బోనస్ హామీ అమలు కాలేదని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సు ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించామని తెలిపారు. మాజీ శాసనసభ్యుడు ఆరూరి రమేష్ మాట్లాడుతూ ఈ నెల 22న వర్ధన్నపేట నియోజకవర్గంలో నిర్వహించే బీఆర్ఎస్ శిక్షణ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు, సభ్యత్వ నమోదు బాధ్యులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు సాగునీరు, పెట్టుబడి సాయం, రైతు బీమా, విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అందాయని ఆరూరి రమేష్ తెలిపారు. ప్రస్తుతం రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు సరైన ధర, కొనుగోలు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణను వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, పెట్టుబడి సాయం వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు భరోసా కల్పించిందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న విమర్శలను కూడా వారు ఖండించారు. మహిళల అభ్యున్నతి, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న కృషిని విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని సూచించారు.



## హాఫీజ్‌పేట్ కో-లివింగ్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, జూన్ 20**

నగరంలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న హాఫీజ్‌పేట్ మార్తాండ నగర్‌లోని ఓ కో–లివింగ్ హాస్టల్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ నివసిస్తున్న వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలు మరింత వ్యాపించకుండా వేగంగా స్పందించి అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు చెలరేగిన విషయాన్ని గమనించిన హాస్టల్ నివాసితులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదం కారణంగా భవనంలోని కొంత సామగ్రి దగ్ధమైనట్లు సమాచారం. అయితే ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. మంటలు ఎలా చెలరేగాయనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ లేదా ఇతర కారణాలతో ప్రమాదం జరిగి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, అధికారుల విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**హైదరాబాద్, జూన్ 20**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 24 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ యోగా ఆరోగ్యకరమైన, సమతుల్యమైన జీవన విధానానికి పునాది అని అన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, అంతర్గత శక్తిని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వమని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యోగా ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా



ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పార్లమెంట్ సభ్యులు కె. లక్ష్మణ్, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, యోగా సాధకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెంపొందుతాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. యువతతో పాటు అన్ని వయసుల వారు యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని సూచించారు.

## మీనాక్షి నటరాజన్‌కు మద్దతుగా సత్యాగ్రహ దీక్ష

**హైదరాబాద్, జూన్ 20**

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్య సభ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన తీరుకు నిరసనగా గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ దీక్షకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ అధ్యక్షుడు సునీల్ పన్వర్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్ ముఖ్య అతిథులుగా హాజరై సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను



బలోపేతం చేయాల్సిన సమయంలో ఇటువంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. న్యాయం కోసం చేపట్టిన ఈ సత్యాగ్రహ దీక్ష ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంకేతమని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి ఈ అంశంపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.



## వర్షాలకు సిద్ధం కావాలి

**హైదరాబాద్, జూన్ 20**

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఇటీవల రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాలేదు. అయితే నేటి నుంచి పరిస్థితుల్లో గణనీయమైన మార్పు కనిపించనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలపై వర్షాల ప్రభావం అధికంగా ఉండనుంది. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం జిల్లాలతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉండటంతో రైతులు, కూలీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమలోని కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్నిచోట్ల స్వల్ప వ్యవధిలోనే అధిక వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయే అవకాశం ఉండటంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ అయ్యాయి. తెలంగాణలో కూడా నేటి నుంచి వర్షాల ప్రభావం పెరగనుంది. ముఖ్యంగా మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సీఈవో వివరణ

**హైదరాబాద్, జూన్ 20**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ--2026 కార్యక్రమం అమలుపై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలు విధానాన్ని దశలవారీగా వివరించారు. ఓటరు జాబితాల నవీకరణలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటర్లకు ముందే వివరాలు నింపిన గణన పత్రాలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందిస్తూ పత్రాల నింపడంలో మార్గనిర్దేశం చేసి, పూర్తయిన పత్రాలను తిరిగి సేకరిస్తున్నట్లు వెల్లడించారు. సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు బూత్ స్థాయి అధికారులకు తగిన శిక్షణ అందించామని చెప్పారు. విధుల నిర్వహణలో నైతిక ప్రమాణాలను పాటించాలని వారికి స్పష్టమైన సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమంలో బూత్ స్థాయి ప్రతినిధుల పాత్రను కూడా అధికారులు వివరించారు. ఓటర్లకు అవగాహన కల్పించడం, ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించడం వారి బాధ్యతల్లో భాగమని తెలిపారు.



## వన మహోత్సవం--2026 కుకారం

**జూన్ 20**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం--2026 కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘనంగా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా మహిళా శక్తి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, నాగర్‌కర్నూల్ శాసనసభ్యుడు రాజేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందరూ కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారి సంగ్రామ్ సింగ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే మొక్కలు నాటడమే కాకుండా వాటిని



సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరగడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణం లభిస్తుందని ఆయన తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో విజయవంతంగా అమలు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.



## క్రీడలతోనే విద్యార్థుల సమగ్ర వికాసం

**మేడ్చల్-మల్కాజిగిరి, జూన్ 20**

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తూంకుంటలోని పల్లవి విద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ మైదానాన్ని శాసన మండలి సభ్యుడు మల్క కొమురయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం వంటి అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే భావనకు క్రీడలే బలమైన పునాదిగా నిలుస్తాయని ఈటల రాజేందర్ అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు అలవడతాయని వివరించారు. ఫుట్‌బాల్ మైదానం వంటి వసతులు యువతను చెడు అలవాట్లు, వ్యసనాల బారిన పడకుండా కాపాడగలవని అభిప్రాయపడ్డారు. భారతదేశం ప్రాచీన నాగరికత, సంస్కృతి, విద్యా సంప్రదాయాలకు నిలయమని ఆయన పేర్కొన్నారు. యోగా భారతీయ జీవన విధానంలో అంతర్భాగమని, ప్రపంచవ్యాప్తంగా దానికి లభిస్తున్న ఆదరణ దేశ గౌరవాన్ని మరింత పెంచిందన్నారు. ప్రతి పాఠశాలలో యోగా సాధనకు ప్రాధాన్యం కల్పించి విద్యార్థులలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. నేటి సమాజంలో ఒత్తిళ్లు, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యతో పాటు యోగా, క్రీడలు, నైతిక విలువలు కూడా అవసరమని ఈటల రాజేందర్ అన్నారు.



## ఆరోగ్యకర సమాజానికి పర్యావరణ పరిరక్షణ అవసరం

**హైదరాబాద్, జూన్ 20**

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాద్‌లో యశోద ఆసుపత్రులు, హెల్ప్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఆరోగ్య--పర్యావరణ నాయకత్వ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం ఒకదానితో మరొకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. పరిశుభ్రమైన గాలి, స్వచ్ఛమైన నీరు, సమతుల్య పర్యావరణ వ్యవస్థ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన 'పర్యావరణహిత జీవన విధానం' మరియు 'ఒకే భూమి--ఒకే ఆరోగ్యం' వంటి కార్యక్రమాలు స్థిరమైన అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని గవర్నర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. వైద్య సంస్థలు పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంధన పొదుపు, వ్యర్థాల సమర్థ నిర్వహణ, పచ్చదనం పెంపు, సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో ఆసుపత్రులు ముందుండాలని కోరారు. ఆరోగ్య రంగం పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ కాలుష్యం కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# ఢిల్లీ హెడ్ కోచ్‌గా గంగూలీ?

**న్యూఢిల్లీ, జూన్ 20,**

భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి ఐపీఎల్‌లో కీలక బాధ్యతలు దక్కే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్‌కు క్రికెట్ డైరెక్టర్‌గా ఉన్న గంగూలీని 2027 సీజన్‌కు ప్రధాన కోచ్‌గా నియమించాలని ఫ్రాంచైజీ యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం.

19వ సీజన్‌లో నిరాశాజనక ప్రదర్శన చేసిన ఢిల్లీ క్యాపిటల్స్, వచ్చే సీజన్‌లో తొలి టైటిల్ లక్ష్యంగా కోచింగ్ విభాగంలో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత ప్రధాన కోచ్ హేమంగ్ బదోనిని తప్పించి, ఆయన స్థానంలో గంగూలీని నియమించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అలాగే భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌కు బ్యాటింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించే అవకాశమూ ఉన్నట్లు సమాచారం. దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అనుబంధ జట్టు ప్రిటోరియా క్యాపిటల్స్‌కు గంగూలీ కోచ్‌గా వ్యవహరించిన అనుభవం ఉండటం






ఆయనకు కలిసివస్తుందని భావిస్తున్నారు. అయితే గంగూలీని ప్రధాన కోచ్‌గా నియమించడంపై ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ప్రసిద్ధ ధాటికి ఆఫ్ఘాన్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది

**చెన్నై, జూన్ 20**




భారత వేగ బౌలర్ ప్రసిద్ధ కృష్ణ అద్భుత బౌలింగ్‌తో ఆఫ్ఘానిస్తాన్‌పై తీవ్ర ప్రభావం చూపించాడు. చెన్నై వేదికగా జరుగుతున్న మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘానిస్తాన్ జట్టును అతడు ఆరంభంలోనే కుదేలు చేశాడు. తొలి స్పెల్‌లోనే కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. ఐదు ఓవర్లు బౌలింగ్ చేసిన ప్రసిద్ధ కృష్ణ కేవలం ఆరు పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు కీలక వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అతని దెబ్బకు ఆఫ్ఘానిస్తాన్ టాప్ ఆర్డర్ పూర్తిగా కూలిపోయి జట్టు కష్టాల్లో పడింది. ఆఫ్ఘాన్ ఓపెనర్ గుర్బాజ్‌తో పాటు జర్దాన్, రహ్మత్ షా, రసూలీ వికెట్లను ప్రసిద్ధ వరుసగా కూల్చాడు. చెన్నై పిచ్‌పై లభించిన బౌన్స్‌ను సమర్థంగా వినియోగించుకున్న అతడు బ్యాటర్లను రక్షణాత్మకంగా ఆడేలా చేసి చివరికి వారి తప్పిదాలను వికెట్లుగా మలిచాడు. ముఖ్యంగా అతడు సృష్టించిన ఒత్తిడికి ఆఫ్ఘాన్ బ్యాటర్లు సమాధానం చెప్పలేక తడబడిపోయారు. మరోవైపు తొలి మూడు వికెట్లకు వచ్చిన క్యాచ్‌లను మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఫస్ట్ స్లిప్‌లో అద్భుతంగా అందుకోవడం భారత జట్టుకు మరింత ఊపునిచ్చింది. దాదాపు ఒకే తరహాలో వచ్చిన మూడు క్యాచ్‌లను రోహిత్ ఎలాంటి పొరపాటు లేకుండా అందుకోవడం విశేషం. ప్రసిద్ధ కృష్ణ ధాటికి ఆఫ్ఘానిస్తాన్ తక్కువ స్కోరుకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. తాజా సమాచారం ప్రకారం 15 ఓవర్లు ముగిసే సమయానికి ఆఫ్ఘానిస్తాన్ నాలుగు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ప్రస్తుతం హష్మతుల్లా, హజ్మతుల్లా క్రీజులో ఉండగా, జట్టును గట్టెక్కించే బాధ్యత వారిపై పడింది. భారత బౌలర్లు ఇదే ఒత్తిడిని కొనసాగిస్తే ఆఫ్ఘానిస్తాన్ భారీ స్కోరు చేయడం కష్టమేనని మ్యాచ్ పరిస్థితులు సూచిస్తున్నాయి.

# భారత్--ఐర్లాండ్ మ్యాచ్‌ల సమయం ముందుకు..

**న్యూఢిల్లీ, జూన్ 20**






భారత క్రికెట్ జట్టు త్వరలో యూకే పర్యటనకు బయల్దేరనుండగా, ఐర్లాండ్‌తో జరగబోయే రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు కీలక మార్పు చోటుచేసుకుంది. బెల్ఫాస్ట్ వేదికగా జూన్ 26 నుంచి ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో మ్యాచ్‌ల సమయాన్ని ముందుగా నిర్ణయించిన రాత్రి షెడ్యూల్ నుంచి సాయంత్రం 6 గంటలకు మార్చినట్లు సమాచారం. ఇంతకుముందు ఈ మ్యాచ్‌లు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కావాల్సి ఉండగా, ఇప్పుడు గంటన్నర ముందుగానే ఆరంభం కానున్నాయి. భారత్‌లో టెలివిజన్, డిజిటల్ వీక్షకుల సంఖ్యను పెంచడం, ముఖ్యంగా యువ ప్రేక్షకులను ఆకర్షించడం లక్ష్యంగానే ఈ నిర్ణయం తీసుకున్నారనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ మార్పు వెనుక భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రభావం కూడా ఉందన్న ప్రచారం మరింత ఊపందుకుంది. ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించి అపారమైన గుర్తింపు తెచ్చుకున్న ఈ 15 ఏళ్ల ఓపెనర్ ఇప్పుడు భారత జట్టులో చోటు దక్కించుకోవడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, యువత అతని ఆటను ప్రత్యక్షంగా చూడాలని ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, రాత్రి ఆలస్యంగా కాకుండా సాయంత్రం వేళ మ్యాచ్‌లు ఉంటే వీక్షకుల సంఖ్య మరింత పెరుగుతుందనే లెక్కలతోనే ఈ మార్పు జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఐర్లాండ్ క్రికెట్ వర్గాలు కూడా సూర్యవంశీ ఎంపికతో టికెట్లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని ఇప్పటికే వ్యాఖ్యానించాయి. అయితే మైదానంలో సూర్యవంశీ ఫామ్ మాత్రం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో అతనికి అపారమైన క్రేజ్ ఉన్నప్పటికీ, ఇటీవలి భారత--ఏ తరఫున ఆడిన మ్యాచ్‌లలో అతను పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో సాధించిన పరుగులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ఐర్లాండ్ పర్యటనకు ముందు అతను తిరిగి లయ అందుకుంటాడా అన్నదానిపై అందరి దృష్టి నిలిచింది. ఇదే సమయంలో బీసీసీఐ అతనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కూడా స్పష్టమవుతోంది. అతని వయసును దృష్టిలో పెట్టుకుని ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలో అతనితో పాటు తల్లిదండ్రులు ఉండేందుకు అనుమతి ఇవ్వడం ద్వారా బోర్డు అతనిని ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తగా మేనేజ్ చేయాలనే సంకేతాలు ఇచ్చింది. మొత్తానికి, ఐర్లాండ్

# ఐపీఎల్‌ను తేలికగా తీసుకుంటున్న విదేశీ ప్లేయర్లపై గావస్కర్ ఆగ్రహం..


**న్యూఢిల్లీ, జూన్ 20**



ఐపీఎల్ టోర్నమెంట్‌ను తేలికగా తీసుకుంటున్న కొంతమంది విదేశీ క్రికెటర్ల తీరుపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బీసీసీఐ ఎన్ని నిబంధనలు తీసుకొచ్చినా, కొంతమంది ఆటగాళ్లు ఏదో ఒక కారణం చూపుతూ టోర్నీ మధ్యలోనే జట్టును వీడుతున్నారని ఆయన విమర్శించారు. జట్టులో అవకాశాలు లభించ కపోతే గాయాల సాకుతో స్వదేశానికి వెళ్లి అక్కడి స్థానిక టోర్నీల్లో పాల్గొంటున్నారని గావస్కర్ ఆరోపిం చారు. ఇలాంటి తీరును నియంత్రించ డానికి బీసీసీఐ మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# హార్దిక్ పాండ్యా గాయంతో టీమిండియాకు షాక్..


**న్యూఢిల్లీ, జూన్ 20**




టీమిండియాకు మరోసారి గాయాల రూపంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో శిక్షణ పొందుతున్న సమయంలో అతడి తొడ కండరానికి గాయం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గాయం తీవ్రత కారణంగా కోలుకోవడానికి అనుకున్నదానికంటే ఎక్కువ సమయం పడుతుందని వైద్య బృందం అంచనా వేసింది. దీంతో హార్దిక్ పాండ్యా ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు మాత్రమే కాకుండా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల జట్టులోనూ సెలెక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిణామం 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని అతడి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగానే తీసుకున్న నిర్ణయమని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

# మెస్సీ హ్యాట్రిక్‌తో అర్జెంటీనా ఘనవిజయం..

**న్యూఢిల్లీ, జూన్ 20**



ప్రపంచ క్రీడా రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫిఫా వరల్డ్ కప్ ప్రారంభ దశలోనే సంచలన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు రికార్డుల వర్షం కురుస్తుండగా, మరోవైపు అనూహ్య వివాదాలు ఫుట్‌బాల్ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. తాజాగా అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టిన మ్యాచ్ తర్వాత, ఓడిపోయిన అల్జీరియా జట్టు ఫిఫాకు అధికారిక ఫిర్యాదు చేయడం ఇప్పుడు అంతర్జాతీయ క్రీడా వర్గాల్లో చర్చనీయాం శంగా మారింది. గ్రూప్ స్టేజ్ తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు 3--0 తేడాతో అల్జీరియాపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ మూడు అద్భుత గోల్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. అయితే ఈ పరాజయాన్ని జీర్ణించు కోలేని అల్జీరియా ఫుట్‌బాల్ సమాఖ్య, మ్యాచ్ అనంతరం ఫిఫాకు అధికారికంగా కంప్లైంట్ చేసింది. మ్యాచ్ సమయంలో మెస్సీ చేసిన ఒక చర్యపై రిఫరీ సరైన నిర్ణయం తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. అల్జీరియా ఆరోపణల ప్రకారం, ఒక సందర్భంలో మెస్సీ కాలు తమ జట్టు కెప్టెన్‌పై బలంగా తాకినప్పటికీ రిఫరీ దానిని తీవ్రమైన ఫౌల్‌గా పరిగణించలేద ని, రెడ్ కార్డ్ ఇవ్వాల్సిన పరిస్థితిని కూడా పట్టించుకోలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ అలెక్సిస్ మెక్ అలిస్టర్ తమ ఆటగాడిని మోచేతితో తోసిన ఘటనను కూడా రిఫరీ పట్టించుకోలేదని అల్జీరియా ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మ్యాచ్‌కు పోలాండ్‌కు చెందిన ప్రముఖ రిఫరీ షిమోన్ మార్సినియాక్ బాధ్యతలు నిర్వహిం చడం కూడా ఇప్పుడు వివాదానికి మరింత ఆజ్యం పోస్తోంది. 2022 వరల్డ్ కప్ ఫైనల్‌లో కూడా అర్జెంటీనా జట్టుకు సంబంధించిన మ్యాచ్‌కే ఆయన రిఫరీగా వ్యవహరించిన విషయం గుర్తు చేస్తూ, అల్జీరియా పక్షం ఆయన నిర్ణయాలపై పక్షపాత ఆరోపణలు చేస్తోంది. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మొత్తానికి, మెస్సీ అద్భుత ప్రదర్శనతో అర్జెంటీనా విజయాన్ని అందుకున్నప్పటికీ, మ్యాచ్ అనంతర ఫిర్యాదుతో వరల్డ్ కప్ వేదికపై కొత్త వివాదానికి తెరలేచింది. ఫిఫా ఈ ఆరోపణలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు క్రీడా ప్రపంచం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.




## మూడో వన్డేలో ఆఫ్ఘన్ తొలుత బ్యాటింగ్

**చెన్నై, జూన్ 20,**

భారత్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరుగుతున్న మూడో వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో విజయం సాధించిన భారత జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది. చివరి వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు బరిలోకి దిగింది. ఈ మ్యాచ్ కోసం భారత జట్టులో మూడు మార్పులు చేశారు. ప్రసిద్ధ్ కృష్ణ, హర్ష్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో అవకాశం కల్పించారు. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు కూడా నాలుగు మార్పులతో బరిలోకి దిగింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన ఆ జట్టు, చివరి వన్డేలో గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు పోటాపోటీగా రాణించేందుకు సిద్ధమయ్యాయి. భారత జట్టు క్లీన్‌స్వీప్‌పై దృష్టి పెట్టగా, ఆఫ్ఘనిస్తాన్ గెలుపుతో సిరీస్‌ను ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




## 2028లో భారత్‌లో ఫార్ములా వన్ లక్ష్యం

**న్యూఢిల్లీ, జూన్ 20,**

భారతదేశంలో మోటార్ స్పోర్ట్స్‌కు మరింత ఊతమివ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్ములా వన్ సహా అంతర్జాతీయ మోటార్ స్పోర్ట్స్ పోటీల నిర్వహణకు మార్గం సుగమం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. భారత్‌లో మోటార్ స్పోర్ట్స్‌కు ఉన్న ఆదరణ, విస్తరణ అవకాశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. అంతర్జాతీయ స్థాయిలో మోటార్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకం, పెట్టుబడులు, ఆర్థిక రంగాలకు కలిగే ప్రయోజనాలపై కూడా నివేదిక సమర్పించనుంది. నలుగురు నుంచి ఐదుగురు సభ్యులతో కూడిన ఈ టాస్క్ ఫోర్స్, దేశంలో మోటార్ స్పోర్ట్స్ అభివృద్ధికి అవసరమైన విధానాలు, కార్యాచరణ ప్రణాళికలను రూపొందించనుంది.

## ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు ముందు విరాట్ కోహ్లీకి కీలక ఫిట్‌నెస్ టెస్ట్..

**న్యూఢిల్లీ, జూన్ 20**



భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. త్వరలో జరగనున్న ఇంగ్లండ్ పర్యటనలోని వన్డే సిరీస్‌కు ముందు అతడి లభ్యతపై సందిగ్ధత నెలకొంది. దీంతో కోహ్లీకి సంబంధించిన ఫిట్‌నెస్ పరీక్ష ఇప్పుడు కీలకంగా మారింది. ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 75 పరుగుల మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ, అదే మ్యాచ్‌లో తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ఆ తర్వాత నుంచి ఆయన లండన్‌లో పునరా వాసం పొందుతూ కోలుకుంటున్నాడు. తాజాగా కోహ్లీ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌కు హాజరు కానున్నాడని సమాచారం. ఫిట్‌నెస్ నివేదికలు అనుకూలంగా వస్తేనే ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సమావేశమై జట్టును ప్రకటించనుంది. సెలెక్టర్లు కోహ్లీ ఫిట్‌నెస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని సమాచారం.

# చిన్నారి కోరిక తీర్చిన అల్లు అర్జున్

హైదరాబాద్, జూన్ 20,

స్టార్ హీరో అల్లు అర్జున్ లుకేమియాతో బాధపడుతున్న చిన్నారి శ్రద్ధ కోరికను తీర్చి మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. మేక్-ఎ-విష్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చిన్నారిని కలిసిన అల్లు అర్జున్, ఆమెతో కలిసి 'పుష్ప' సినిమాలోని పాపులర్ మూమెంట్స్‌ను రీక్రియేట్ చేశారు. ఈ హృదయాన్ని హత్తుకునే వీడియోను అల్లు అర్జున్ బృందం సామాజిక మాధ్యమాల్లో పంచుకోగా, అది ప్రస్తుతం వైరల్‌గా మారింది. వీడియోలో అల్లు అర్జున్ నవ్వుతూ "హాయ్ శ్రద్ధా.. ఎలా ఉన్నావ్?" అంటూ చిన్నారిని పలకరించారు. అనంతరం 'పుష్ప' సినిమాలోని ఐకానిక్ డైలాగ్ చెప్పాలని ప్రోత్సహించారు. ఇద్దరూ కలిసి పుష్ప సిగ్నేచర్ గడ్డం తడుముకునే స్టెప్ చేయగా, అల్లు అర్జున్ చప్పట్లు కొడుతూ "చాలా క్యూట్" అంటూ చిన్నారిని అభినందించారు. అనంతరం "నువ్వు పూర్తిగా కోలుకున్న తర్వాత హైదరాబాద్‌కు రావాలి" అని ఆమెకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా "పెద్దయ్యాక ఏమవ్వాలని అనుకుం టున్నావ్?" అని అల్లు అర్జున్ అడగగా, శ్రద్ధ "డాక్టర్ అవ్వాలి" అని బదులిచ్చింది. ఈ సంభాషణ నెటిజన్లను భావోద్వేగానికి గురి చేస్తోంది. ఇదిలా ఉంటే, అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా' చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి దీపికా పదుకొణె కీలక పాత్రలో నటిస్తున్నారు.



## కొత్త కథతో ఆకట్టుకున్న 'దీవాన'

హైదరాబాద్, జూన్ 20

కొత్త నటీనటులతో తెరకెక్కిన ప్రేమకథా చిత్రం 'దీవాన' ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. గత రెండు నెలలుగా వినూత్న ప్రచారంతో ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం, భావోద్వేగాలు, స్నేహం, కుటుంబ బంధాలు, ప్రేమ గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ ముందుకు సాగుతుంది. డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం లేకుండా స్నేహితులతో సరదాగా తిరిగే మున్నా అనే యువకుడు అమూల్య అనే యువతిని ప్రేమిస్తాడు. అయితే ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తర్వాతే తన ప్రేమను అంగీకరిస్తానని అమూల్య షరతు పెడుతుంది. ఆ తర్వాత మున్నా జీవితంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి? అతడు తన ప్రేమను గెలుచుకున్నాడా? అనే ప్రశ్నలకు సమాధానమే సినిమా కథ. దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి కొత్త కథను ఆసక్తికరంగా మలచడంలో విజయం సాధించారు. ముఖ్యంగా విరామానికి ముందు వచ్చే మలుపు, చివరి భాగంలోని భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. స్నేహం, తల్లిదండ్రుల ప్రేమ, నిజమైన ప్రేమ విలువను ఎక్కడా విసుగు కలగకుండా వినోదాత్మకంగా చెప్పడంలో దర్శకుడి ప్రతిభ కనిపిస్తుంది. మున్నా పాత్రలో హర్షిత్ రెడ్డి సహజమైన నటనతో మెప్పించాడు. సరదా సన్నివేశాలతో పాటు భావోద్వేగ సన్నివేశాల్లోనూ మంచి నటన కనబరిచాడు. అమూల్య పాత్రలో స్నేహ మణిమేగలై ఆకట్టుకుంది. మధ్యతరగతి తండ్రి పాత్రలో నటుడు నరేశ్ మరోసారి తన అనుభవాన్ని చూపించారు. మిగతా నటీనటులు కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. కథ, కథనం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవగా, నేపథ్య సంగీతం, ఛాయాగ్రహణం కూడా సినిమాకు బలాన్ని చేకూర్చాయి. ప్రచారం పరంగా మరింత బలంగా వెళ్లి ఉంటే ఈ చిత్రానికి మరింత ఆదరణ లభించే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






## రుక్మిణి వసంత్ డీప్‌ఫేక్ కేసులో ముగ్గురు అరెస్ట్

బెంగళూరు, జూన్ 20

కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కృత్రిమ మేధతో తయారు చేసిన మార్ఫ్ చేసిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకున్నారనే ఆరోపణలపై బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నటి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులు కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగించి అభ్యంతరకర దృశ్యాలను సృష్టించి వాటిని ఆన్‌లైన్‌లో ప్రచారం చేశారని గుర్తించారు. ఈ వ్యవహారంలో మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రుక్మిణి వసంత్‌కు సంబంధించిన బికినీ ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. అవి పూర్తిగా నకిలీవని, తన పరువుకు భంగం కలిగించే ఉద్దేశంతో తయారు చేసి ప్రచారం చేస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దృశ్యాలు పూర్తిగా కృత్రిమంగా సృష్టించినవేనని, ప్రజలు వాటిని నమ్మవద్దని ఆమె స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోంరు. నటి ఫిర్యాదు అనంతరం బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు కేసును వేగంగా ముందుకు తీసుకెళ్లారు. ప్రారంభ దశలో పలువురు సామాజిక మాధ్యమ ఖాతాలపై కేసు నమోదు చేసి, ఆ ఖాతాల వివరాల కోసం సంబంధిత వేదికలకు సమాచారం కోరారు.



## సోషల్ మీడియాకు కయాదు లోహర్ విరామం

చెన్నై, జూన్ 20

ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి అవసరమైనట్టే మనసుకూ విశ్రాంతి అవసరమని పేర్కొంటూ, కొంతకాలం డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు అభిమానులకు తెలిపారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకున్న సందేశంలో కయాదు, "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకూ అవసరం. కాస్త నెమ్మదిగా జీవిస్తూ, స్క్రీన్‌కు అవతల ఉన్న నిజమైన జీవితంతో, నాతో నేను మరింత సమయం గడపాలని అనుకుంటున్నాను" అని పేర్కొన్నారు. తనకు ఎప్పటికప్పుడు మద్దతుగా నిలిచిన అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన ఆమె, "మీ ప్రేమ, మీ సందేశాలు నాకు ఎంతో విలువైనవి. కొంతకాలం నేను ప్రత్యక్షంగా సోషల్ మీడియాలో కనిపించకపోయినా, ముఖ్యమైన అప్‌డేట్స్ ఏవైనా ఉంటే నా బృందం ఇదే ఖాతా ద్వారా పంచుకుంటుంది" అని వెల్లడించారు. అందరూ శాంతి, సంతోషం, దయతో ఉండాలని కోరుతూ, త్వరలో మళ్లీ కలుద్దామని పేర్కొన్నారు. ఇటీవలే తన తమ్ముడు ఉదయ్ పుట్టినరోజు సందర్భంగా కయాదు ఒక భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. "నువ్వు ఎంత పెద్దవాడైనా, నా దృష్టిలో ఎప్పటికీ చిన్నవాడివే. జీవితంలో ఏదైనా అయ్యే ముందు నేను మొదట అక్కనయ్యాను" అంటూ ఆమె రాసిన సందేశం అభిమానులను ఆకట్టుకుంది. తమ్ముడిపై తన ప్రేమను సరదాగా వ్యక్తం చేస్తూ, "నిన్ను తప్ప నా తమ్ముడిని ఎవరూ ఇబ్బంది పెట్టడానికి వీల్లేదు" అని కూడా పేర్కొన్నారు. సినిమాల విషయానికి వస్తే, కయాదు లోహర్ ప్రస్తుతం జీవీ ప్రకాశ్ కుమార్ సరసన 'ఇమ్మోర్టల్' అనే హారర్ థ్రిల్లర్‌లో నటిస్తున్నారు. మరియప్పన్ చిన్న దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కయాదు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని ఇటీవల ప్రకటించారు. విడుదలైన టీజర్‌కు కూడా మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో జీవీ ప్రకాశ్, కయాదు లోహర్‌లతో పాటు టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. హారర్, థ్రిల్లర్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా కయాదు కెరీర్‌లో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే కయాదు ఈ నిర్ణయం తీసుకోవడం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే వ్యక్తిగత ప్రశాంతత, మానసిక విశ్రాంతి కోసం ఆమె తీసుకున్న ఈ విరామాన్ని అభిమానులు గౌరవిస్తున్నారు. కొంత విరామం తర్వాత ఆమె మళ్లీ కొత్త ఉత్సాహంతో సోషల్ మీడియాలోకి వస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.




## జూలై 3న 'నాగబంధం' విడుదల

హైదరాబాద్, జూన్ 20,

నటుడు విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పీసీఎక్స్ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను ఆవిష్కరించారు. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, కథనాన్ని అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ట్రైలర్‌లో కనిపించిన విజువల్ ఎఫెక్ట్స్, పురాతన ఆలయాల నేపథ్యం, గ్రాఫిక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తెలుగు సాంకేతిక నిపుణులే అన్ని విజువల్ ఎఫెక్ట్స్‌ను రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం, చారిత్రక అంశాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని మైథాలజీ అడ్వెంచర్‌గా తెరకెక్కించారు. ఈ చిత్రంలో విరాట్ కర్ణ మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ ఓ పవర్‌ఫుల్ పాత్రలో మెరవనున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకులు జునైద్ కుమార్, అబీ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మరింత హైప్ తీసుకొచ్చింది. సినిమా విజువల్‌గా, సాంకేతికంగా ప్రేక్షకులకు థియేటర్లలో గ్రాండ్ అనుభూతిని అందిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాల వెనుక ఉన్న చరిత్రను తర్వాతి తరాలకు తెలియజేసే ప్రయత్నమే ఈ చిత్రమని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం జూలై 3న తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467